సాక్షి అనకాపల్లి
మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



గిరిజనుల సేవ అదృష్టం
పాడేరులో ప్రభుత్వ వైద్య కళాశాలను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. 8లో



సెక్యూరిటీ గార్డుల ఆందోళన
మహారాణిపేట: 3 నెలల బకాయి జీతాలు ఇవ్వాలని కోరుతూ విశాఖ కేజీహెచ్ సెక్యూరిటీ గార్డులు ఆందోళనకు దిగారు.



అప్పన్నకు విశేషంగా తిరువీధి
సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం తిరువీధి ఘనంగా జరిగింది.

‘కూటమి’కి ఫుల్ కిక్

నేతలు, వారి అనుచరుల సిండికేట్లదే హవా

- జిల్లాలో 136 మద్యం షాపులకు లాటరీ ప్రక్రియ
- మొత్తం 3,291 దరఖాస్తుల ద్వారా రూ.65.82 కోట్లు
- అధిక డిమాండ్ ఉన్న షాపులు సిండికేట్లకే..
- జనప్రియ గ్రూప్‌నకు 20 దుకాణాలు, వైజాగ్ గోపీరాజ్ సిండికేట్‌కు 8 దుకాణాలు
- నర్సీపట్నంలో కూటమి నేతల అనుచరులకే 14 షాపులు
- అనకాపల్లిలో పీలా గోవింద అల్లుడిదే హవా



మద్యం దుకాణాలకు డ్రా తీస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



హాజరైన దరఖాస్తుదారులు

సాక్షి, అనకాపల్లి/తుమ్మపాల : మద్యం దుకాణాల మంజూరుకు సోమవారం నిర్వహించిన లాటరీ ప్రక్రియలో కూటమి నేతల హవా నడిచింది. అధికార పార్టీల నేతలు, వారి బినామీలకు చెందిన సిండికేట్లు, జనప్రియ గ్రూప్, విశాఖకు చెందిన మద్యం వ్యాపారస్తులు ఎక్కువ షాపులు దక్కించుకున్నారు. అనకాపల్లిలో శ్రీ సత్యలక్ష్మీ గ్రాండ్ ఫంక్షన్ హాల్లో కలెక్టర్ విజయ కృష్ణన్ ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియ జరిగింది. జిల్లాలోని 8 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న 136 మద్యం షాపులకు 3,291 దరఖాస్తులు వచ్చాయి. డిపాజిట్ల రూపంలో ప్రభుత్వానికి రూ.65.82 కోట్ల ఆదాయం వచ్చింది. జిల్లాలో మద్యం అమ్మకాలు అత్యధికంగా ఉన్న దుకాణాలకు సగటున 4 నుంచి 5 వరకూ కూటమి నేతల బినామీలే దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో మెజారిటీ షాపులను వారే దక్కించుకున్నారు. నర్సీపట్నం పరిసరాల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు వర్గీయులకు, అనకాపల్లిలో ప్రస్తుత ఎమ్మెల్యే కొణతాల సోదరుడి కుమారుడు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అల్లుడి అనుచరులకు, యలమంచిలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సోదరుడి వర్గీయులకు, చోడవరంలో టీడీపీ నేత మల్లునాయుడు సిండికేట్లకు ఎక్కువ షాపులు దక్కాయి.



ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో కోలాహలం



డ్రా కార్యక్రమానికి చంటి పిల్లలతో హాజరైన మహిళలు

సజావుగా లాటరీ ప్రక్రియ..

జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి సుధీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన లాటరీ ప్రక్రియ ఉదయం 8.30 ప్రారంభమై మధ్యాహ్నం 1.30 గంటకు ముగిసింది. కలెక్టర్ విజయ కృష్ణన్ లాటరీ తీశారు. ఒక్కో మద్యం దుకాణానికి ముగ్గురు చొ ప్పున 136 షాపులకు 403 మందిని ఎంపిక చే శారు. వీరిలో మొదటి వ్యక్తి డ్రాప్ అయితే తరువా త స్థానంలో ఉన్న రెండో వ్యక్తికి దుకాణం టెండర్ వెళుతుంది. జిల్లాలో 25మంది మహిళలకు డ్రాలో దుకాణాలు లభించాయి. జిల్లా వ్యాప్తంగా 8 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నర్సీపట్నం, పాయకరావుపేట, అనకాపల్లి, యలమంచిలి, చోడవరం-మాడుగుల, సబ్బవరం-పరవాడల్లో సిండికేట్లుగా విడిపోయి దరఖాస్తు చేసుకున్నారు. డిమాండ్ ఉన్న దుకాణాలకు రెండు దరఖాస్తుల చొప్పున వేసుకున్నారు. అత్యధికంగా జనప్రియ గ్రూప్‌నకు 20 దుకాణాలు, వైజాగ్‌కు చెందిన గోపీరాజ్ సిండికేట్‌కు 8 దుకాణాలు దక్కాయి. చోడవరానికి చెందిన మల్లునాయుడు సిండికేట్ అనకాపల్లి పరిధిలో 180 దరఖాస్తులు వేయగా 9 షాపులు దక్కాయి.

కూటమి నేతల అనుచరుల సిండికేట్లకు..

నర్సీపట్నం నియోజకవర్గంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు అనుచరులు 110 షాపులకు టెండర్ వేయగా.. అత్యధికంగా 14 షాపులు వచ్చాయి. అనకాపల్లిలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తమ్ముడి కొడుకు ఆధ్వర్యంలో సిండికేట్‌గా ఏర్పడి 10 వరకు షాపులు దక్కించుకున్నారు. యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అనుచరులు 280 దరఖాస్తులు వేసి 6 దుకాణాలు దక్కించుకున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో జనసేన, టీడీపీకి చెందిన వారు సిండికేట్‌గా 45 షాపులకు టెండర్ వేయగా.. అందులో 6 వరకూ వచ్చాయి. మాకవరపాలెం, కోటవురట్లలో కూటమి నేతలు సిండికేట్‌గా ఏర్పడి మొత్తం 72 దుకాణాలకు దరఖాస్తు చేరుంచారు. వారి సిండికేట్లో చిన్నపిల్లలు ఉన్న తల్లులు కూడా డ్రా దగ్గరకు వచ్చారు. రెండు షాపులు దక్కించుకున్నారు. చోడవరం నియోజకవర్గ పరిధిలో కూటమి పార్టీ అనుచరులకే 10 వరకూ షాపులు దక్కాయి. పాయకరావుపేట, చోడవరం, యలమంచిలి, సబ్బవరం-పరవాడ సిండికేట్లు తరువాత స్థానంలో ఉన్నారు.

రేపటి నుంచి మద్యం విక్రయాలు



మీడియాతో మాట్లాడుతున్న డీఈపీఓ సుధీర్

తుమ్మపాల: లాటరీలో షాపులు దక్కించుకున్న విజేతల ద్వారా నూతన మద్యం పాలసీ ప్రకారం ఈనెల 16 నుంచి మద్యం విక్రయాలు ప్రారంభమవుతాయని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి వి.సుధీర్ చెప్పారు. సత్యలక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాలులో కలెక్టర్ విజయ కృష్ణన్ ఆధ్వర్యంలో సోమవారం డ్రా తీసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 136 మద్యం దుకాణాలకు 3,291 దరఖాస్తులు రాగా, అత్యంత పారదర్శకంగా డ్రా నిర్వహించామన్నారు. అత్యధికంగా గొలుగొండ ఎక్సైజ్ పరిధిలో, అత్యల్పంగా సబ్బవరం పరిధిలో దరఖాస్తులు వచ్చాయన్నారు.

డీఎస్సీ శిక్షణ సంస్థల నమోదుకు దరఖాస్తులు

తుమ్మపాల: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇవ్వడం కోసం శిక్షణ సంస్థల నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఇన్‌చార్జి జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి కె.రాజేశ్వరి తెలిపారు. రాష్ట్రంలో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా 5,050 ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారన్నారు. దరఖాస్తు చేసుకునే శిక్షణ సంస్థలు కనీసం రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్లకు కోచింగ్ ఇచ్చి ఉండాలని, గత డీఎస్సీలో కనీసం 100 మంది ఉద్యోగాలు పొంది ఉండాలని, మూడు సంవత్సరాల సరాసరి టర్నోవర్ రూ.40 లక్షలు ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్న శిక్షణ సంస్థలు ఇతర వివరాల కోసం డాక్యుమెంట్‌ను https:// apeprocurement. gov. in/ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, ఈ నెల 21వ తేదీలోగా సమర్పించాలని తెలిపారు.

దివ్యాంగ మహిళలకు కేజీబీవీల్లో బోధనేతర పోస్టులు

- దరఖాస్తుకు నేడు ఆఖరి రోజు



సమావేశంలో మాట్లాడుతున్న పాత్రుపల్లి వీరుయాదవ్

అనకాపల్లి: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) బోధనేతర పోస్టుల నియామకాల్లో దివ్యాంగులైన మహిళలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని, అర్హులైన నిరుద్యోగులు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరుయాదవ్ చెప్పారు. స్థానిక ఉడ్‌పేట సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాన్ టీచింగ్ పోస్టులైన హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, ఆయా, నైట్ వాచ్‌ఉమెన్‌తోపాటు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు తమ తమ మండలాల్లో ఉన్న ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంఘం సభ్యులు యలమర్తి రవి, కోనేటి భార్గవ్ సాయి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేషనల్ యూత్ బాక్సింగ్‌లో మౌనికకు రజతం



సిల్వర్ మెడల్ సాధించిన బాక్సర్ బొంతు మౌనిక

నర్సీపట్నం: హర్యానాలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన సీనియర్, యూత్ నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో నర్సీపట్నం బాక్సర్ బొంతు మౌనిక 80 కేజీల విభాగంలో రజత పతకం సాధించింది. క్రీడాకారిణికి హర్యానా ప్రభుత్వం రూ.20 వేల నగదు పురస్కారాన్ని ప్రకటించినట్లు కోచ్ అబ్బు తెలిపారు. క్రీడాకారిణి మౌనిక, కోచ్ అబ్బులను బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మణదేవ్ అభినందించారు.

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు రేపు

మహారాణిపేట (విశాఖ): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు బుధవారం నిర్వహించనున్నట్టు జెడ్పీ సీఈవో పి.నారాయణ మూర్తి సోమవారం తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జె. సుభద్ర అధ్యక్షతన ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతాయన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 4, 3వ స్థాయీ సంఘ సమావేశాలు 11 గంటలకు, 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 12 గంటలకు నిర్వహించనున్నట్టు తెలిపారు.

నేడు కేంద్ర మంత్రి రాక

మహారాణిపేట (విశాఖ): కేంద్ర స్కిల్ డెవలప్‌మెంటు శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరీ మంగళవారం విశాఖ రానున్నారు. న్యూఢిల్లీ నుంచి విమానంలో బయలు దేరి మంగళవారం ఉదయం 8.20 గంటలకు విశాఖ చేరుకుంటారు. అక్కడ నుంచి ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ (ఏపీఎంటీజెడ్)కు వెళతారు. ఉదయం 9-12 గంటల వరకు అక్కడే ఉంటారు. అనంతరం రుషికొండ గీతం కాలేజీని సందర్శిస్తారు. సాయంత్రం 6.55 గంటలకు విమానంలో విజయవాడ వెళతారు.

అప్పన్న సన్నిధిలో విశ్వం చిత్ర యూనిట్



అప్పన్న ఆలయంలో హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీనువైట్ల తదితరులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం విశ్వం చిత్ర యూనిట్ దర్శించుకుంది. ఆ చిత్రం హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల, నటులు బెనర్జీ, పృథ్వీ, షకల శంకర్ తదితరులు స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వీరి పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదంని అధికారులు అందజేశారు.

‘పల్లె పండగ’లో రూ.214 కోట్లతో పనులు

తుమ్మపాల: జిల్లాలో పల్లె పండగ కార్యక్రమంతో పండగ వాతావరం ఏర్పడిందని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. సోమవారం ప్రారంభమైన పల్లెపండగ కార్యక్రమం ప్రతి మండలంలో ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. పల్లె పండగ కార్యక్రమం క్రింద జిల్లాలో రూ.214 కోట్లతో 2,343 పనులు చేపట్టనున్నామని, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.172.3 కోట్లతో 1,697 పనులు, వ్యక్తిగతంగా లబ్ధి చేకూర్చేందుకు రూ. 41.7 కోట్ల విలువ చేసే 646 పనులను చేపట్టి పూర్తి చేయనున్నట్లు ఆమె తెలిపారు. పల్లె పండగ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసినట్టు తెలిపారు. జిల్లాలో సోమవారం గ్రామాల్లో పల్లెపండగ నిర్వహించినట్టు నోడల్ అధికారి, డ్వామా ప్రాజెక్టు అధికారి బి.పూర్ణిమదేవి తెలిపారు.

నరాల వ్యాధులపై సదస్సు

మహారాణిపేట: నరాలకు సంబంధించిన వ్యాధులపై ఈ నెల 17 నుంచి నగరంలో నాలుగు రోజుల పాటు జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ గోపి తెలిపారు. కేజీహెచ్ న్యూరాలజీ విభాగంలో సోమవారం డాక్టర్ బుచ్చిరాజు మీడియాతో మాట్లాడారు. సదస్సులో భాగంగా నరాలకు సంబంధించిన అనేక వ్యాధుల మీద చర్చ జరుగుతుందని, దేశ, విదేశాల నుంచి దాదాపు రెండు వేల మంది వైద్యులు పాల్గొంటారని తెలిపారు.

ఈపీడీసీఎల్ అప్రమత్తం

- భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు
- విద్యుత్ సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఏ విధమైన విద్యుత్ సమస్యలు తలెత్తినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సంస్థ పరిధిలోని 11 జిల్లాల అధికారులను అప్రమత్తం చేశారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలతో పాటు కోనసీమ, కాకినాడ, ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఏపీఈపీడీసీఎల్ ముందస్తు ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా 11 జిల్లాల అధికారులతో సీఎండీ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా చూడాలని, అవసరమైన యంత్రాంగం, పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఎస్ఈ, ఈఈలను ఆదేశించారు. తుఫాన్ వల్ల ఏర్పడే విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు ఏపీఈపీడీసీఎల్ కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసినట్లు సీఎండీ వెల్లడించారు. భారీ వర్షాల ప్రభావానికి తెగిపడిన విద్యుత్ వైర్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లపై పడిపోయిన చెట్లకొమ్మల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వాటి సమాచారాన్ని కార్పొరేట్ కార్యాలయంలోని టోల్ ఫ్రీ నెం 1912 లేదా కంట్రోల్ రూమ్ నంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని పృథ్వీ తేజ్ విజ్ఞప్తి చేశారు.

విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయం - 83310 18762	
విశాఖపట్నం	73822 49881
అనకాపల్లి	94906 10022
అల్లూరి సీతారామరాజు	94906 10026

విశాఖ డీఈవోకు ఇంగ్లిష్ టీచర్ సరెండర్

- ఉత్తర్వులు తీసుకోవడానికి నిరాకరించిన ఉపాధ్యాయిని

యలమంచిలి రూరల్: విధులకు ఎక్కువ సెలవులు పెట్టడం, విద్యా బోధన సక్రమంగా చేయకపోవడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న తులసీనగర్ జెడ్పీ హైస్కూల్లో ప్లస్-2 ఇంగ్లిష్ పీజీటీ చింతల రాధారాణిని విశాఖ డీఈవోకు సరెండర్ చేస్తూ అనకాపల్లి డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ ఆదేశాలు జారీ చేశారు. ఇంగ్లిష్ టీచర్‌పై వచ్చిన ఫిర్యాదులపై విచారణ నివేదిక ఆధారంగా ఇటీవల ఆమెకు షోకాజ్ నోటీస్ జారీ చేసిన డీఈవో శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.వి.హిమబిందుకు సోమవారం అధికారికంగా సమాచారం ఇచ్చారు. హెచ్ఎం ఆమెకు ఉత్తర్వులను ఇవ్వడానికి ప్రయత్నించగా తీసుకోవడానికి రాధారాణి నిరాకరించారు. సాయంత్రం వరకు వేచి చూసిన హెచ్ఎం మరోసారి ప్రయత్నించి అప్పటికీ ఆమె నిరాకరించడంతో దీనిని ధ్రువీకరిస్తూ మిగతా ఉపాధ్యాయులందరితో డీఈవో జారీ చేసిన సరెండర్ ఆదేశాలపై హెచ్ఎం సంతకాలు తీసుకున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై సోమవారం జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం-1994ను కఠినంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం లింగ నిష్పత్తి 1000:978గా ఉందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి పరీక్షలు చేసే లేబొరేటరీలు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించనున్నట్టు ఆమె తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడశిశువు అని తెలిసి, గర్భస్రావాలు చేయించడం వంటి సమాచారం తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబర్‌కు, ఆన్‌లైన్ గ్రీవెన్స్ pcpndt.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా తెలియజేయవచ్చని చెప్పారు. ఏఎన్ఎం, ఆశాలు గృహ సందర్శనలు, పలు విధాలుగా ఆడపిల్లల సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. నూతన వధూవరులకు, గర్భిణులు, అత్త మామలకు దీనిపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.ఎస్.వి.కె.బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో 73 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. కొత్తగా 11 కేంద్రాలు గుర్తింపు కోసం దరఖాస్తులు వచ్చాయన్నారు. స్కానింగ్ కేంద్రాలను మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. జూనియర్ సివిల్ జడ్జి రమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆ పుణ్యధారలు ఎక్కడ?

- పంచదార్ల పుణ్యక్షేత్రానికి పొంచి ఉన్న ముప్పు
- శిథిల స్థితికి రాధామాధవ స్వామి ఆలయం అంతర్గత గోడ
- పుణ్యధార వద్ద తాత్కాలికంగా ముళ్ల కంచెలతో మూసివేత



రాధామాధవ స్వామి ఆలయంలో పుణ్యధార వద్ద గతంలో భక్తులు ఇలా స్నానాలు ఆచరించేవారు..



పుణ్యధార వద్ద కూలిపోతున్న అంతర్గత గోడకు కర్రలు సపోర్టుగా పెట్టి, ముళ్ల కంచెను ఏర్పాటు చేసిన దృశ్యం

రాంబిల్లి(యలమంచిలి): చారిత్రక పంచదార్ల ఉమాధర్మలింగేశ్వరస్వామి ఆలయం వద్ద పరిస్థితులు దయనీయంగా తయారయ్యాయి. పుణ్యధారల వద్ద అంతర్గత పురాతన రాతి గోడ శిథిలావస్థకు చేరుకుంది. ప్రమాదం పొంచి ఉండడంతో ఆలయ కమిటీ సభ్యులు ముళ్ల కంచె వేసి పుణ్య ధారల వద్దకు వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. ఈ విషయం తెలియక పుణ్య స్నానాల కోసం వెళ్తున్న భక్తులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. కొంత కాలం కిందట ప్రముఖ యూట్యూబర్ హర్షసాయి పంచదార్ల పుణ్యక్షేత్రంను అభివృద్ధి చేస్తానని ముందుకొచ్చారు. ఈ మేరకు ఎత్తు పల్లాలు సరిచేసే క్రమంలో మట్టితో ఆలయం కింద ఉన్న రాధామాధవ స్వామి ఆలయం అంతర్గత రాతి గోడను ఆనుకుని మట్టితో ఫిల్లింగ్ చేయించాడు. ఈ మట్టి ఫిల్లింగ్ ఎత్తుగా చేయడం వల్ల ఆలయం అంతర్గత గోడ ఇటీవల కురిసిన వర్షాలకు ఒత్తిడికి గురై దెబ్బ తింది. ఈ గోడ గుండా ప్రవహించే పుణ్యధార వద్ద భక్తులు పవిత్ర స్నానాలు ఆచరిస్తుంటారు. ఇప్పుడా రాతి గోడ దెబ్బతినడంతో అటుగా భక్తులు పుణ్యధార వద్దకు వెళ్లకుండా తాత్కాలికంగా ముళ్ల కంచెలు వేశారు. దీంతో ఈ పుణ్యక్షేత్రంలో ప్రవహించే ఐదు పుణ్యధారలు కుచించుకుపోతున్నాయి. మరోవైపు పురాతన ఆలయం పేరిట మరమ్మతులు చేయకూడదు అంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలయం అభివృద్ధిపై శీతకన్ను వేస్తున్నారు. ఉత్తరాంధ్రలో కార్తీక మాసంలో ఇక్కడ శివాలయంలో ఉన్న పుణ్యధారలో భక్తులు స్నానాలు ఆచరించి శివమాలలు, అయ్యప్ప మాలలు, భవానీ మాలధారణలు చేపట్టడం ఆనవాయితీ. నిత్యం వేలాది మంది భక్తులు తరలివచ్చి శివుడిని దర్శించుకుంటారు. ఇంత ప్రాధాన్యం ఉన్న పంచదార్ల పుణ్యక్షేత్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది.


అవగాహన రాహిత్యంతో పనులు

ఇటీవల ప్రముఖ యూట్యూబర్ హర్షసాయి ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని ముందుకొచ్చి ఎటువంటి ప్లాన్ లేకుండా పుణ్యధారలు ప్రవహించే రాతి కట్టడాలు వద్ద విచ్చలవిడిగా పనులు చేపట్టారు. ఇష్టానుసారం తవ్వకాలు జరిపి మట్టి ఫిల్లింగ్ చేశారు. ఆ పనులు కూడా మధ్యలోనే ఆపేయడంతో కొండ మీద నుంచి వచ్చే నీరు ఆలయం వద్ద ఫిల్లింగ్ చేసిన పాలం మట్టిలోకి వెళ్లడంతో దిగువన ఉన్న అంతర్గత రాతి గోడలకు ప్రమాదం వాటిల్లింది. ఇష్టానుసారంగా పనులు చేపట్టడం వల్లనే పురాతన రాతి గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాలకు పుణ్యధారల వద్ద గోడలు కూలిపోతున్నాయని అధికారులకు చెప్పినా ఫలితం లేకుండా పోయింది. తరచూ కురుస్తున్న వర్షాల ధాటికి కూలిపోతున్న రాతి గోడల దగ్గర సెంట్రింగ్ కర్రలను స్థానికులు దన్నుగా పెట్టారు. స్థానిక పరిసర గ్రామాల ప్రజలు ఈ పుణ్యధారల నుంచి వచ్చే శుద్ధ జలాన్ని తీసుకెళ్లి వంటలకు, తాగడానికి వినియోగిస్తారు. ఇప్పుడు ఆకస్మికంగా పుణ్యధారలకు వెళ్లే మార్గాలను మూసివేయడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది ప్రాణాలకు తెగించి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు.



రాధమాధవ స్వామి ఆలయం వద్ద మట్టి ఫిల్లింగ్ చేసి అసంపూర్తిగా మధ్యలోనే వదిలేసిన పనులు

ఈ ఏడాది కార్తీక మాసమెలా?



ఎటువంటి ప్రణాళిక లేకుండా మట్టి ఫిల్లింగ్‌తో ఆలయం వద్ద రాతి గోడలు కూలిపోయేలా చేశారు. ఈ ఏడాది కార్తీక మాసంలో ఏవిధంగా భక్తులు స్నానాలు చేస్తారో అర్థం కావడం లేదు. ఈ పరిస్థితికి దేవదాయ శాఖ అధికారులు, స్థానికంగా ఉన్న కొంత మంది దళారులే కారణం. ఆలయం పురాతన ఆనవాళ్లు, ఆ రూపురేఖలు మారిపోయాయి. అధికారులు ఇప్పటికైనా ఆలయం అభివృద్ధికి కృషి చేయాలి.

– ధూళి రమణ, వైఎస్సార్‌సీపీ నేత, భోగాపురం

త్వరితగతిన మరమ్మతు పనులు



పంచదార్ల ఉమాధర్మలింగేశ్వర స్వామి ఆలయం వద్ద పురాతన రాతి గోడలు కూలిపోతున్నాయన్న విషయం తమ దృష్టికి వచ్చింది. ఆలయం వద్ద బ్యూటిఫికేషన్ పేరిట అభివృద్ధి చేస్తామని కొంత మంది దాతలు ముందుకు వచ్చారు. దానిలో భాగంగానే ఆలయం వద్ద అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పురాతన ఆలయం వద్ద ఎటువంటి ఆనవాళ్లు పోలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు రాతి గోడలు వద్ద మట్టి ఫిల్లింగ్ చేసిన ప్రాంతంలో నీరు ఇంకి రాతి గోడలు దెబ్బ తిన్నాయి. త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేసి, భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– సాంబశివరావు ఈవో యలమంచిలి డివిజన్

క్లుప్తంగా

లాకౌట్‌ను నిరసిస్తూ కార్మికుల ఆందోళన


అభిజిత్ ఫెర్రోటెక్ లాకౌట్‌ను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న కార్మికులు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లోని అబిజిత్ ఫెర్రో టెక్ లాకౌట్‌ను నిరసిస్తూ కంపెనీ ఎదుట సోమవారం కార్మికులు ఆందోళన నిర్వహించారు. కంపెనీ లాకౌట్ ప్రకటించడంతో వెయ్యి మంది ఉద్యోగులు, కార్మికులు రోడ్డున పడ్డారని ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, మండల కన్వీనర్ సోమినాయుడు వాపోయారు. ఎస్ఈజెడ్ రావడం ద్వారా జీవితాలు మారిపోతాయని అధికారులు చెప్పారని, అందుకు విరుద్ధంగా విధులకు వెళ్తున్న కార్మికులను గేటు బయటే ఉంచడం సరికాదన్నారు. కార్మికుల పొట్ట కొట్టే ఇటువంటి చర్యలు సరికావన్నారు. ప్రభుత్వ పెద్దలు ఆలోచన చేసి కార్మికులకు పాత పద్ధతిలో పనులు కల్పించాలని లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

‘రైవాడ’ మరమ్మతులకు రూ. 3.06 కోట్ల మంజూరు

దేవరాపల్లి: రైవాడ జలాశయం పరిధిలో మెయింటెనెన్స్ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి రూ. 3.06 కోట్లు మంజూరయ్యాయని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పిల్వే గేట్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ పనులు, జలాశయం గట్టుపై రహదారి అభివృద్ధితో పాటు దేవరాపల్లి మండలంలో బలహీనంగా ఉన్న సాగునీటి కాలువల అభివృద్ధికి రూ. 2.67 కోట్లు మంజూరయ్యాయన్నారు. కె.కోటపాడు మండల పరిధిలో దెబ్బతిన్న సాగునీటి కాలువలను పటిష్టం చేసేందుకు రూ. 39.47 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులకు సంబంధించి పరిపాలన ఆమోదం లభించిందన్నారు. సాంకేతిక ఆమోదం పొందిన తర్వాత టెండర్ ప్రక్రియ చేపడతారన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు

- కలెక్టర్ విజయ కృష్ణన్
- పలు సమస్యలపై 151 అర్జీల స్వీకరణ

తుమ్మపాల: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ప్రజల అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విజయ కృష్ణన్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, ఎస్డీసీలు రమామణి, సుబ్బలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్ స్వీకరించారు. అనంతరం అర్జీలపై తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినతులను కింది స్థాయి అధికారులకు అప్పగించకుండా స్వయంగా పరిశీలించాలన్నారు. సమస్యలపై స్వయంగా అధికారులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం వ్యక్తిగత, సామాజిక అంశాలపై 151 అర్జీలను ప్రజలు అందజేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 99, పంచాయతీ రాజ్ శాఖకు 11, ఇతర శాఖలకు 41 వినతులు నమోదయ్యాయి.


అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో దయానిధి

ఏఎంఏఎల్ కళాశాలలో తెలుగు సబ్జెక్టును పునరుద్ధరించాలి...

గ్రామీణ జిల్లా కేంద్రం అనకాపల్లి పట్టణంలో ఏఎంఏఎల్ ఎయిడెడ్ కళాశాలలో తెలుగు సబ్జెక్టు పునరుద్ధరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టరేట్‌లో వినతి పత్రం అందించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం రమణ మాట్లాడుతూ ఏఎంఏఎల్ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కోర్సులు ప్రాధాన్యం వల్ల జిల్లా నలుమూలల నుంచి వచ్చి విద్యార్థులు అధిక సంఖ్యలో చదువుతున్నారని, ఇక్కడ తెలుగు సబ్జెక్టు లేకుండా చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రపంచ దేశాల్లో తెలుగు ప్రాముఖ్యతను కొనియాడుతుంటే, తెలుగు విద్యార్థులకు మాతృభాషను దూరం చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. తక్షణమే అధికారులు స్పందించి తెలుగు సబ్జెక్టును అమలులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కే.అర్జున్‌నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

గండి బాబ్జీ అనుచరుల భూ ఆక్రమణలపై నిరసన



టీడీపీ నేత గండి బాబ్జీ అనుచరుల భూ ఆక్రమణలపై బాధితుల నిరసన

టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అనుచరుల భూఆక్రమణ నుంచి తమ స్థలాలు కాపాడాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద బాధితులు నిరసన చేపట్టారు. పరవాడ మండలం ఇ. మర్రిపాలెంలో సర్వే నంబరు 15, 16/1లో ఐదెకరాల భూమిని 17 మందిమి 2012 సంవత్సరంలో కొనుగోలు చేశాం. వీటికి అన్ని అనుమతులతో 80 ప్లాట్లుగా లేఅవుట్ వేసి విక్రయించగా, కొనుగోలుదారులు స్థలాల్లో నిర్మించుకున్న పునాదులను గండి బాబ్జీ అండతో టీడీపీ, జనసేన అనుచర వర్గం ఈ నెల 6న జేసీబీలు, బుల్‌డోజర్లు మందీ మార్బలంతో అక్రమంగా చొరబడి ధ్వంసం చేశారు. దీనిపై పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టి బాబ్జీ అనుచరులు దుల్ల కృష్ణ, దుల్ల రామునాయుడు, కర్రి దివాకర్‌నాయుడులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయినప్పటికీ సదరు స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, తమకు రక్షణ కల్పించాలని కోరుతూ 25 మంది బాధితులు కలెక్టరేట్‌లో ఫిర్యాదులు చేశారు. బాధితుల్లో టీడీపీ, జనసేన పార్టీకి చెందిన వారుండటం గమనార్హం.

సచివాలయ హెల్త్ సెక్రటరీల సమస్యలపై ఆందోళన


సమస్యల పరిష్కారంపై హెల్త్ వర్కర్ల ఆందోళన

తమను పూర్తి స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖలో తీసుకోవాలని, ఎంపీహెచ్ఏ(ఎఫ్)లుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ఏపీ యునైటెడ్ గ్రామ/వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామ/వార్డు సచివాలయం హెల్త్ సెక్రటరీలు ఆందోళన నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో, కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ కమిషనర్లు/ఎంపీడీవో, డీఎంహెచ్‌వో పరిధిల్లో ఒకే సమయంలో ఆయా అధికారుల పనులు చేయలేక తీవ్ర మానసిక ఒత్తిడిని, పనిభారాన్ని భరిస్తూ విధులు నిర్వహిస్తున్నామని వాపోయారు. వివిధ శాఖల మధ్య సమన్వయం జరిగేలా తగు ఆదేశాలు జారీ చేయాలని, మొత్తం సిబ్బందిని వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో తీసుకురావాలని ఎంత మొత్తుకున్నా ప్రభుత్వం ఆలకించడం లేదని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆళ్ల దేవకి తెలిపారు. మూడేళ్లుగా కోరుతున్నా సమస్య పరిష్కారం కాలేదని, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసినా... నేటి వరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ శంకరరావు, కోశాధికారి వి.వి. శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రత్నం, లక్ష్మి, సూర్యకళ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 26 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 26 అర్జీలు వచ్చాయని ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో అర్జీదారుల నుంచి వినతులు తీసుకుంటూ వారివారి సమస్యలను తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ చట్టపరిధిలో సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ వంటి సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ స్మారక కథల పోటీలో బలరామస్వామికి బహుమతి


హైదరాబాద్‌లో ఉత్తమ కథా రచయితగా సన్మానం అందుకుంటున్న బొద్దేడ బలరామస్వామి

కశింకోట : కశింకోటకు చెందిన కథా రచయిత బొద్దేడ బలరామస్వామి రాసిన ‘అరటితొక్క’ కథకు మహాకవి శ్రీశ్రీ స్మారక కథల పోటీలో ఉత్తమ కథగా బహుమతిని గెలుచుకుంది. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సింహ ప్రసాద్ సాహిత్య సమితి నిర్వహణతో ఈ పోటీని నిర్వహించారు. హైదరాబాద్‌లో సోమవారం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి దుశ్శాలువా కప్పి సత్కరించి నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు, అభిమానులు ఆయనను అభినందించారు. గతంలో పలు పోటీల్లో తెలుగు రాష్ట్రాల స్థాయిలో బలరామస్వామికి బహుమతులు లభించాయి.

బస్సు ఢీకొట్టడంతో బైకిస్ట్ మృతి



గుల్లేపల్లి వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారస్ బస్సు, మృతుడు ఈశ్వరరావు

- గుల్లేపల్లి వద్ద సంఘటన

కె.కోటపాడు: మండలంలోని గుల్లేపల్లి కూడలి వద్ద సోమవారం తెల్లవారుజామున లారస్ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకిస్ట్ పసుపులేటి ఈశ్వరరావు(45) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. చోడవరం మండలం రాయపురాజుపేటకు చెందిన ఈశ్వరరావు తెల్లవారుజామున తన ద్విచక్రవాహనంపై ఇంటి వద్ద నుంచి కె.కోటపాడు వైపు బయలుదేరాడు. అదే సమయంలో లారస్ కంపెనీకి ఉద్యోగులను తీసుకెళ్లేందుకు అనకాపల్లి వైపు బస్సు వస్తోంది. ఈ క్రమంలో గుల్లేపల్లి కూడలి వద్ద ఎదురెదురుగా వస్తూ ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొంది. ఈ ఘటనలో బైకిస్ట్ ఈశ్వరరావు తలకు తీవ్ర గాయమై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.కోటపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన స్థలాన్ని ఎస్ఐ ధనుంజయ్ పరిశీలించారు. మృతుడికి బాబు, పాప ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

పేదరికం నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా..

- కర్ణాటక యూనివర్సిటీకి రమేష్‌బాబు నియామకం
- స్వగ్రామం రామచంద్రపాలెంలో హర్షాతిరేకాలు

కోటవురట్ల: కృషి, పట్టుదల ఉంటే పేదరికం అడ్డురాదని నిరూపించారు డాక్టర్ రమేష్‌బాబు తమరాన.. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ రైతు బిడ్డగా కన్నవారికే కాకుండా పుట్టిన ఊరికి పేరు తెచ్చిపెట్టారు. మండలంలోని రామచంద్రపాలేనికి చెందిన ఆయన కర్ణాటక యూనివర్సిటీకి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. సీయూకే మానసిక శాస్త్ర విభాగంలో నియమిస్తూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ 73వ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని, ఈ నెల 14న విధుల్లో చేరానని ఈ సందర్భంగా రమేష్‌బాబు తెలిపారు. ఇంతటి గొప్ప అవకాశాన్ని కల్పించిన యూనివర్సిటీకి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకానికి కట్టుబడి విద్యార్థుల్లో బుద్ధి వికాసానికి, యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.


రమేష్‌బాబు

చదువంతా సర్కారు బడుల్లోనే...

రామచంద్రపాలేనికి చెందిన తమరాన రామ్మూర్తి, సత్యవతి దంపతుల కుమారుడు డాక్టర్ రమేష్‌బాబుకు చదువంటే చిన్నతనం నుంచి మక్కువ. పేద కుటుంబానికి చెందిన ఆయన చదువంతా సర్కారు బడుల్లోనే సాగింది. ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇంటర్, డిగ్రీ నర్సీపట్నం ప్రభుత్వ కళాశాలల్లోనూ పూర్తి చేశారు. బీఎడ్ డి.యర్రవరంలోను, ఎంఈడీ భీమవరంలోనూ పూర్తి చేశారు. పుదుచ్చేరి పాండిచ్చేరి అనువర్తిత కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అనువర్తిత మనోవిజ్ఞాన శాస్త్రంలో ఎంఎస్సీ, అక్కడే పీహెచ్‌డీ కూడా పూర్తి చేశారు. అదే యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకునిగా పనిచేశారు. 2018–2019లో శ్రీపెరంబదూర్‌లోని రాజీవ్‌గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 2019 నుంచి ఇప్పటి వరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకాలజీ, క్రైస్ట్ (డీమ్డ్ టు ద యూనివర్సిటీ), బెంగళూర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. అక్కడి నుంచి సీయూకేలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. ఆయనకు బి.కె.పల్లి ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు, గ్రామస్తులు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

శ్రద్ధా ఫౌండేషన్‌కు 9 మంది నిరాశ్రయుల అప్పగింత



అల్లిపురం: మానసిక రుగ్మతతో బాధపడుతున్న తొమ్మిది మంది నిరాశ్రయులకు ఏయూటీడీ, శ్రద్ధా ఫౌండేషన్ సంయుక్తంగా చికిత్స అందించి.. వారిని సాధారణ స్థితికి తీసుకొచ్చాయి. కోలుకున్న వారిలో రాయబరేలికి చెందిన హరిప్రసాద్, బనారస్‌కు చెందిన రామ్‌మనోహర్, గుడియాన, బిందో, నేపాల్ దదూజాకు చెందిన గౌతమ్, సుందర్‌గంజ్(ఒడిశా)కు చెందిన గోరంగో నాయక్, రాయ్‌గడ్‌కు చెందిన జితేంద్ర సాహు, బిహార్‌కు చెందిన బిపిన్ కుమార్, గ్వాలియర్‌కు చెందిన సోనమ్ ఉన్నారు. వీరి చిరునామాలు తెలుసుకుని.. టూటౌన్ పోలీసుల సహకారంతో సోమవారం వీరిని ముంబయిలోని శ్రద్ధా కార్యాలయానికి తరలించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. వీరందరినీ శ్రద్ధా ప్రతినిధి ధృవ్ బడేకర్, స్టాఫ్ నర్స్ సుప్రియ, డ్రైవర్ అబిద్, నీలేష్ తీసుకెళ్లినట్లు ఆయన వెల్లడించారు.

సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి

- లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి వెంకట శేషమ్మ


హాస్టల్ విద్యార్థినులతో సమావేశమైన లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి వెంకట శేషమ్మ

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీ సెక్టార్–10లోని గిరిజన కళాశాల విద్యార్థినుల వసతిగృహాన్ని సోమవారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ సందర్శించారు. ఇక్కడ ఎంత మంది వసతి పొందుతున్నారు? వసతి, భోజన సౌకర్యాలు ఎలా ఉన్నాయని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. హాస్టల్ వార్డెన్ ఝాన్సీ పాల్గొన్నారు.

అడవి బిడ్డలకు సేవలందించడం అదృష్టం


మెడికల్ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- ఆహ్లాదకర వాతావరణం పాడేరు సొంతం
- వైద్య విద్యకు అనువైన ప్రాంతం
- వైద్యవిద్య తరగతుల ప్రారంభోత్సవంలో కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: గిరిజనులకు సేవలందించడం ఎంతో అదృష్టమని, వైద్య విద్యను సంపూర్ణంగా అభ్యసించి, వారికి సేవ చేయాలని కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్ తెలిపారు. పాడేరులో నిర్మించిన వైద్య కళాశాలలో సోమవారం నుంచి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులను కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు సురక్షిత ప్రాంతమని, భయాందోళనలు లేకుండా వైద్య విద్యార్థులు విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ ఏడాది నుంచే పాడేరు వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభించాలని సంకల్పించి, 50 మందికి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ప్రవేశాలు కల్పించినట్టు చెప్పారు. కాగా 42 మంది విద్యార్థులు ప్రవేశం పొంది కళాశాలకు హాజరయ్యారు. వారితో పాటు వారి తల్లిదండ్రులను కూడా కళాశాల యాజమాన్యం ఆహ్వానించింది. వారందరితో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈఏడాది నుంచి వైద్య విద్య తరగతులు నిర్వహించాలన్న పట్టుదలతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలను మేరకు గత నెల రోజులుగా ఇంజినీరింగ్ అధికారులు ఎంతో కృషి చేసి మెడికల్ కళాశాలతో పాటు అనాటమీ, బయో–కెమిస్ట్రీ ల్యాబులు,ఇతర భవనాలను పూర్తి చేసి అందివ్వడం గొప్ప విషయమన్నారు. కొంత మంది తల్లిదండ్రులు పాడేరు అంటే వెనుకడుగు వేస్తున్నారని, ఎంటువంటి సమస్యలు లేని ప్రశాంతమైన వాతావరణంలో వైద్య విద్యకు అనువైన ప్రాంతం పాడేరు అని కలెక్టర్ తెలిపారు. 15 ఏళ్ల క్రితం వోయిస్టుల ప్రభావం ఉండేదని, ప్రస్తుతం ఆ ఇబ్బందులు లేవన్నారు. చాలా మంది దీనిని మారుమూల ప్రాంతంగా భావిస్తున్నారని, కానీ రెండు గంటల్లో విశాఖపట్నం చేరుకుని, అక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లగలమని వివరించారు. జిల్లాలో సుమారు 1,100 గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించే పనులు జరుగుతున్నాయని, త్వరలో వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. ఆహ్లాదకర, ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు ఎటువంటి భయాందోళనలు లేకుండా వైద్య విద్యను అభ్యసించాలని కోరారు. మరో రెండు మూడు నెలల్లో అన్ని సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. గిరిజనులకు సేవలందించే అవకాశం ఇక్కడ చదువుకున్న వారికి కలుగుతుందన్నారు. గిరిజనులు కూడా సంప్రదాయాలను పాటించడంతో పాటు ఉన్నత విద్యలను అభ్యసిస్తున్నారని, గిరిజనులు గౌరవప్రదంగా, మంచిగా ఉంటారని కలెక్టర్ తెలిపారు.

సంయుక్త కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ 2010లో తాను కూడా వైద్య విద్యను అభ్యసించామని తెలుపుతూ ఆనాటి అనుభవాలను వివరించారు. అన్ని వృత్తుల్లోకి వైద్యవృత్తికి ఎంతో ప్రాధాన్యత ఉంది ని, డాక్టర్ అంటే ప్రాణాలు రక్షించేవారని, అంతటి ప్రాధాన్యత ఉన్న విద్యను అభ్యసించడం గర్వంగా భావించాలన్నారు. పాడేరు కళాశాలలో ప్రారంభమైన మొదటి బ్యాచ్ రానున్న బ్యాచ్‌లకు ఆదర్శంగా, నమూనాగా నిలవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్‌బి.శ్రీనివాస్,ఏపీఎంఎస్ఐడీసీ కార్యనిర్వాహక ఇంజినీర్ డి.అచ్చంనాయుడు, గైనిక్ వైద్యనిపుణులు డాక్టర్ టి.నర్సింగ్‌రావు అన్ని విభాగాల వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

కాఫీ సేకరణ ధరల పెంపు

మహారాణిపేట: గిరిజనుల వద్ద నుంచి సేకరిస్తున్న కాఫీ కొనుగోలు ధరల పెంపునకు గిరిజన సహకార సంస్థ(జీసీసీ) నిర్ణయించింది. కాఫీ ధరలను 2024–25 సంవత్సరానికి నిర్ణయించేందుకు సోమవారం అపెక్స్ కమిటీ సమావేశం జీసీసీ కేంద్ర కార్యాలయంలో జరిగింది. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, కాఫీ బోర్డు ఆఫ్ ఇండియా(బెంగళూరు) డాక్టర్ డి.ఆర్.బాబు రెడ్డి, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఇతర అధికారులు పాల్గొన్నారు. గత సంవత్సరం కాఫీ కొనుగోలు ధరలు అరెబికా పార్చ్‌మెంట్ రకానికి కిలో రూ.280, అరెబికా చెర్రి రకానికి రూ.145, రోబస్టా చెర్రి కాఫీ రకానికి రూ.70 చొప్పున ఉండగా, అంతర్జాతీయ కాఫీ ధరలను దృష్టిలో పెట్టుకుని ఈ సంవత్సరం కాఫీ కొనుగోలు ధరలను అరెబికా పార్చ్‌మెంట్ రకానికి రూ.285, అరెబికా చెర్రి రకానికి రూ.150, రోబస్టా చెర్రి కాఫీ రకానికి రూ.80 చొప్పున నిర్ణయించారు. ఈ సందర్భంగా జీసీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి మాట్లాడుతూ గిరిజన కాఫీ రైతుల సంక్షేమం కోసం ధరలు పెంచినట్లు తెలిపారు.

హెల్త్ సెక్రటరీలపై తీవ్ర పని ఒత్తిడి

- ‘ఉషా’గౌరవ అధ్యక్షురాలు మణి

సీతమ్మధార: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలకు ఎంపీహెచ్ఏలుగా పదోన్నతులివ్వాలని ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ విలేజ్/వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఉషా) గౌరవ అధ్యక్షురాలు పి.మణి డిమాండ్ చేశారు. ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీ పార్కులో సోమవారం నిర్వహించిన హెల్త్ సెక్రటరీల ధర్నాలో ఆమె మాట్లాడారు. హెల్త్ సెక్రటరీలను వైద్య–ఆరోగ్యశాఖ పరిధిలోకి పూర్తి స్థాయిలో తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వీరంతా జీవీఎంసీ, ఎంపీడీవో, డీఎంహెచ్‌వో పరిధిలో ఉన్న కారణంగా తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా వివిధ రకాలుగా ఆందోళన చేస్తున్నా.. ఫలితం లేకపోయిందని విచారం వ్యక్తం చేశారు. పలు జిల్లాల్లో వివిధ శాఖలు అదనపు పనులు అప్పగించడం అన్యాయమన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు అయిన హెల్త్ సెక్రటరీలకు సెలవులు లేక అవస్థలు పడుతున్నారన్నారు. దాదాపుగా 60కి పైగా యాప్‌ల కారణంగా పని ఒత్తిడితో మానసిక ప్రశాంతత ఉండటం లేదన్నారు. వ్యాక్సిన్, క్యారియర్ రవాణా భత్యం ఇవ్వాలని, యూనిఫాం అలవెన్సు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విలేజ్ క్లినిక్‌లను సబ్ సెంటర్లుగా మార్చే అంశాలను పరిశీలించాలని కోరారు. ఆదివారాలు, పండగ రోజుల్లో డ్యూటీలు వేయవద్దన్నారు. ధర్నాలో అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు జి.కల్యాణి, అధ్యక్షురాలు ఎస్.సుభాషిణి, కార్యనిర్వాహక కార్యదర్శి జి.సంధ్యారాణి, పి.రాజ్యలక్ష్మి, జి.లక్ష్మి, ఎస్.భాగ్యలక్ష్మి, ఆర్.సరోజిని, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న గౌరవ అధ్యక్షురాలు మణి

ఆరోగ్య తారక మంత్రం.. వ్యాయామం

ఉరుకులు పరుగులతో కూడిన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపిస్తున్నారు. ఎంత పని ఒత్తిడి ఉన్నా వ్యాయామాన్ని అలక్ష్యం చేయడం లేదు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో జిమ్‌కు లేదా వాకింగ్, రన్నింగ్‌కు వెళ్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. కరోనా మహమ్మారి తర్వాత ఫిట్‌నెస్‌పై పట్టణవాసుల్లో మరింత ఆసక్తి పెరిగింది.


ఎముకల గట్టిదనానికి సోలార్ వ్యాయామం చేస్తున్న వృద్ధుడు

- శరీర ఫిట్‌నెస్‌కు నిత్యం వాకింగ్, రన్నింగ్
- పట్టణవాసుల్లో పెరిగిన ఆసక్తి
- అనకాపల్లిలో 15 ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు

అనకాపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా మానవుని జీవనశైలి విధానం మారుతోంది. కరోనా వంటి విపత్తుల తర్వాత ప్రతి వ్యక్తి వ్యాయామంపై ఆసక్తి పెంచుకున్నారు. ప్రతి ఒక్కరూ ఫిట్‌గా ఉండాలని, చక్కటి శరీర ఆకృతిని సాధించాలని, ఆరోగ్యంగా జీవనం సాగించాలని అనే నినాదంతో క్రమం తప్పకుండా వ్యాయామం చేసేందుకు అడుగులు వేస్తున్నారు. ప్రత్యేకంగా నిపుణుల పర్యవేక్షణలో కసరత్తులకు ఆసక్తి చూపుతున్నారు. జీవీఎంసీ జోన్ పరిధిలో కరోనా తర్వాత ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో అధికారులు 15 ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయడంతో యువత, వృద్ధులు ఉదయం, సాయంత్రం సమయంలో వ్యాయామం చేస్తున్నారు.

అందుబాటులో ప్రభుత్వ ఓపెన్ జిమ్‌లు..

పట్టణంలో గాంధీనగరం, ఆర్ఏఆర్ఎస్ కార్యాలయం రహదారి, విజయరామరాజుపేట, ఎన్టీఆర్ క్రీడా మైదానం, శారదానది ఒడ్డున శాంతి పార్కు, కోట్ని వీధి, గవరపాలెం పార్కు సెంటర్, లక్ష్మీనారాయణనగర్, అరుంధతీనగర్, మండలంలో కొత్తూరు పంచాయతీ వద్ద తదితర ప్రాంతాల్లో ప్రభుత్వం ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. నిత్యం వేలాది మంది ప్రజలు ఉదయం, సాయంత్రం సమయంలో వ్యాయామం చేస్తున్నారు. దేహదారుఢ్యం మేరకు వ్యాయామం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. వయస్సును బట్టి వ్యాయామం చేయాలని నిపుణులు చెబుతున్నారు. పట్టణ పరిధిలో అధునాతన పరికరాలు, హైటెక్ హంగులతో వ్యాయామశాలలు ఆకర్షిస్తున్నాయి. సిక్స్ ప్యాక్ మోజులో కొందరు, అందం కోసం మరికొందరు, ఊబకాయం సమస్యతో మరికొందరు, వ్యాధుల బారిన పడకుండా కొందరు నిత్యం వ్యాయామం చేస్తున్నారు. 15 నుంచి 65 సంవత్సరాలు వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ జిమ్‌లలో చేరి వ్యాయామం చేస్తున్నారు.


ఎన్టీఆర్ క్రీడా మైదానంలో వాకింగ్ ట్రాక్‌పై రన్నింగ్ చేస్తున్న దృశ్యం

తీసుకోవలసిన జాగ్రత్తలు..

- నిపుణుల పర్యవేక్షణలో వ్యాయామం చేయడం వల్ల ప్రాణాలకు ముప్పు వాటిల్లదు.
- సరైన శిక్షణ, ఆధునిక పరికరాలు ఉన్న జిమ్‌లో చేరడం మంచిది.
- తెలిసీ తెలియని పద్ధతిలో వ్యాయామం చేస్తే, హర్ట్‌ఎటాక్ బారిన పడే అవకాశాలు ఉన్నాయి.
- వ్యాయామం చేసేవారు ఆహారపు అలవాట్లల్లో మార్పులు చేసుకోవాలి.
- శరీరం నుంచి ఎక్కువగా చెమట పోతున్న సమయంలో తప్పకుండా తాగునీరు తీసుకోవాలి.
- ఎక్కువగా చల్లని పానీయలు తీసుకోవడం మంచిది.
- రాత్రి సమయంలో అవకాశం ఉన్నంత మేరకు 8 గంటల లోపు తొందరగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి.

నడకని మించిన దివ్యౌషధం లేదు



నా వయస్సు 77 సంవత్సరాలు. నేను రోజూ ఉదయం మూడు కిలోమీటర్లు నడుస్తాను. వ్యాయామంలో చాలా సులువైనది, ఖర్చులేనిది నడక మాత్రమే, రోజుకు ఒక గంట నడిచినట్లయితే ఆరోగ్యం సక్రమంగా ఉంటుంది. నేను 30 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా నడుస్తున్నాను. కరోనా సమయంలోనూ నడిచాను. కరోనా నాకు సోకినప్పటికీ దానివల్ల ఏ ఇబ్బంది పడలేదు. ఆరోగ్యంగా ఉండడం మన చేతిలోనే ఉంది. నడకని మించిన దివ్యౌషధం మరొకటి లేదు.

– కె.వి.గౌరీపతి, విశ్రాంత డిప్యూటీ డీఈవో, అనకాపల్లి

వ్యాయామం చేస్తున్నా



నిత్యం వ్యాయామం చేయడంతో వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా జీవించవచ్చు. వయస్సును బట్టి వ్యాయామం చేయాలి. వర్షాలు పడినప్పుడు గొడుగు వేసుకుని వాకింగ్‌కు వెళ్తాను. శరీరం నుంచి చెమటపట్టే వరకూ రోజు వ్యాయామం చేస్తున్నాను. ప్రస్తుతం ఆరోగ్యంగా అన్ని పనులు చేసుకుంటున్నాను.

– నల్లాల దేముళ్లు, విశ్రాంత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి, అనకాపల్లి

10 ఏళ్లుగా వాకింగ్ చేస్తున్నాను



నావయస్సు 54 సంవత్సరాలు, నేను పది సంవత్సరాలుగా వాకింగ్ చేస్తున్నాను. గతంలో జిమ్ చేసేవాడిని. ఉదయం మాత్రమే 3 నుంచి 4 కిలోమీటర్లు వాకింగ్ చేస్తున్నాను. వాకింగ్ కాకుండా, షాప్‌కు వెళ్లే సమయంలో నడుచుకుని వెళ్లేందుకు ఎక్కువగా శ్రద్ధ చూపిస్తున్నాను. ఎటువంటి ఆరోగ్య సమస్యా లేదు. వాకింగ్ చేయడం వల్ల రాత్రి సమయంలో నిద్ర బాగా పడుతోంది.

– పాలమరశెట్టి, ఓం నమః శివాయ, అనకాపల్లి

క్లుప్తంగా

గవరపాలెంలో అన్నసమారాధన


అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ విజయకుమార్

అనకాపల్లి: పట్టణంలో ప్రశాంతమైన వాతావరణంలో దసరా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని సీఐ టి.వి.విజయకుమార్ తెలిపారు. స్థానిక గవరపాలెం నిదానందొడ్డి కామాక్షి అమ్మవారిని సోమవారం ఆయన దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పట్టణ పరిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలను అన్ని వర్గాల ప్రజలు ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేకంగా నిర్వహించారన్నారు. అనంతరం పట్టణ పురవీధుల్లో కనకదుర్గమ్మను ఊరేగించి, సాయంత్రం నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను, ఉపాధ్యక్షుడు శొంఠ్యాణ సతీష్, కోశాధికారి ధవలేశ్వరం లక్ష్మణరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తగ్గిన టమాటా ధర

కశింకోట: తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా ధర తగ్గింది. కిలోకు ఒక్కసారిగా రూ.30 తగ్గింది. గత వారం కిలో రూ.వంద ఉండగా, ఈ వారం రూ.70కి విక్రయాలు సాగాయి. బంగాళదుంప రూ.40, ఉల్లి రూ.50, బీరకాయ, బెండకాయ, దొండకాయ, క్యారెట్, బీట్‌రూట్, గోరు చిక్కుడు, ఆగాకర, వంకాయ రూ.60 చొప్పున విక్రయాలు సాగాయి.

నిలకడగా రైవాడ నీటిమట్టం


పుష్కలంగా నీటి నిల్వలతో కళకళలాడుతున్న రైవాడ జలాశయం

దేవరాపల్లి : రైవాడ జలాశయం నీటిమట్టం నిలకడగా ఉంది. జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 113.50 మీటర్లకు చేరుకుంది. ప్రస్తుతం జలాశయంలోకి 300 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ఖరీఫ్ పంటల సాగుకు కుడి, ఎడమ కాలువల ద్వారా 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ డీఈఈ జి.సత్యంనాయుడు తెలిపారు. వెరసి వరదనీటి నిల్వలతో కనుచూపు మేర జలాశయం కళకళలాడుతుంది.

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
విశ్వం	: సత్యనారాయణ స్క్రీన్-1
శ్వాగ్	: సత్యనారాయణ స్క్రీన్-2
వేట్టయన్	: పర్తిసాయి
వేట్టయన్	: షిర్డిసాయి
జిగ్రా	: వెంకటేశ్వర
మా నాన్న సూపర్ హీరో	: శ్రీసత్య
మార్టిన్	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 536 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,780	5,310
మొదటి రకం	4,400	5,290
రెండో రకం	3,600	4,400
మూడో రకం	3,120	3,410

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 67 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-32 యూనిట్లు, ఓ పాజిటివ్-23 యూనిట్లు, ఏబీ పాటిజివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 67 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-32 యూనిట్లు, ఓ పాజిటివ్-23 యూనిట్లు, ఏబీ పాటిజివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

సీసీ డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన


పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ భీశెట్టి వరహ సత్యవతి

అనకాపల్లి: గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే మానవుని జీవనశైలిలో మార్పులు వస్తాయని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో కొత్తూరు పంచాయతీ పరిధి రామాపురం, కృష్ణాపురం గ్రామాల్లో రూ.62 లక్షల ఎంపీపీ నిధులతో సీసీ డ్రైనేజీల నిర్మాణ పనులను సోమవారం ఆయన జెడ్పీ వైస్ చైర్మన్ భీశెట్టి వరహ సత్యవతితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. దశలు వారీగా గ్రామాల్లో డ్రైనేజీ, సీసీరోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నామన్నారు. ప్రజలు వ్యాధులు బారిన పడకుండా ఉండాలంటే వాడక నీరు డ్రైనేజీల్లో పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులు మాత్రమే ఇవ్వాలని సూచించారు. రహదారులపై చెత్తను వేయడం వల్ల వ్యాధుల బారినపడే అవకాశాలు ఉన్నాయన్నారు. వర్షాలు పడే సమయంలో కాచిచల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న, ఎంపీటీసీ యు.లక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తపాలా సేవలపై కళాజాత


కళాజాత నిర్వహిస్తున్న అధికారులు

రాంబిల్లి(యలమంచిలి): తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ అధికారులు కోరారు. సోమవారం రాంబిల్లి మండలం కేంద్రంలో తపాలాశాఖ సేవలు, పోస్టల్ ఇన్సురెన్స్, తదితర సేవలపై కళాకారులతో కళాజాత ప్రదర్శనతో ప్రజలకు అవగాహన కల్పించారు.

జిల్లాలో రూ.214 కోట్లతో పలు అభివృద్ధి పనులు

డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అన్నపూర్ణాదేవి


పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీ రమేష్

కశింకోట: జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది రూ.214 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అన్నపూర్ణాదేవి తెలిపారు. కశింకోటలోని అగ్రహారం వీధిలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.2.70 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు సీఎం రమేష్ భూమి పూజ చేశారు. అనంతరం సభలో పీడీ అన్నపూర్ణాదేవి మాట్లాడుతూ పనులను వచ్చే ఏడాది సంక్రాంతికి పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు తెలిపారు. సీఎం రమేష్ మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కశింకోటలో కల్యాణ మండపాల నిర్మాణం, అసంపూర్తి కల్యాణ మండపాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవిందసత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ తాతాయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి రోజారాణి, ఎంపీడీవో వి.వి. రవికుమార్, సర్పంచ్ మంత్రి జయరజని, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, తెలుగు రైతు రాష్ట్ర నాయకుడు గొంతిన శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, టీడీపీ నాయకుడు ఉగ్గిన రమణమూర్తి, మహిళా ప్రతినిధి పి. కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు

కశింకోట మండలంలో ఈ ఏడాది జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపీడీవో వి.వి. రవి కుమార్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వెదురుపర్తి, బయ్యవరం, విసన్నపేట, కశింకోట గ్రామాల్లో రూ.2.77 కోట్లతో ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న సిమెంట్, తారు రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మండల ప్రత్యేక అధికారి రోజారాణి, ఈవోపీఆర్డీ వెంకటలక్ష్మి, తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కాలుష్య కారక ఫార్మా పరిశ్రమలపై చర్యలకు వినతి


డీఆర్వో దయానిధికి వినతి పత్రం అందిస్తున్న గనిశెట్టి

పరవాడ: చెరువులు, గెడ్డలు, కాలువల్లోకి రసాయన వ్యర్థాలను యథేచ్ఛగా విడుదల చేస్తున్న ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు ఆయన అనకాపల్లి డీఆర్వో దయానిధిని సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. పరవాడ ఊర, పెద్ద చెరువులు, ముల్లోడి గెడ్డల్లోకి ఫార్మా పరిశ్రమల రసాయన వ్యర్థాలను శుద్ధి చేయకుండా విడిచిపెట్టడంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. వ్యర్థాల కారణంగా పెద్ద చెరువులో రైతులు పెంచుతున్న చేపలు మరణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముత్యాలమ్మపాలెం సముద్రంలోకి విడుదలవుతున్న రసాయన వ్యర్థాలతో మత్స్య సంపదకు తీరని నష్టం వాటిల్లి, అక్కడి మత్స్యకార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. పరిశ్రమల కాలుష్యంతో తానాం, లంకెలపాలెం, పరవాడ, భరిణికం, సాలాపువానిపాలెం, గొర్లివానిపాలెం, బొద్దపువానిపాలెం గ్రామాల ప్రజలు అనారోగ్య సమస్యలతో అల్లాడుతున్నారని నివేదించారు. కాలుష్య నియంత్రణ చర్యలతోపాటు, శుద్ధి చేయని వ్యర్థాలను జలాశయాల్లోకి విడుదల చేయకుండా నియంత్రించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

వర్సిటీలకు పొట్టిశ్రీరాములు పేరు కొనసాగించాలి

సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యుల నిరసన


ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి: తెలుగు విశ్వవిద్యాలయాలకు పొట్టి శ్రీరాములు పేరు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో తొలగించాలని తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్‌లో తీర్మానించడం అన్యాయమని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం తెలిపారు. సోమవారం స్థానిక మెయిన్ రోడ్డు కన్యకాపరమేశ్వర ఆలయం రహదారిలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు 1985లో అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టారన్నారు. నేటి పాలకులు శ్రీరాములు పేరును తొలగించాలని నిర్ణయించడం అన్యాయమన్నారు. దీనిపై తక్షణమే పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వినకోట నీలేష్ గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, బొడ్డు సోమరాజు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు డ్రైవర్ల ఆందోళన


బయ్యవరంలో సిమెంట్ పరిశ్రమ వద్ద ట్రాన్స్‌పోర్టు డ్రైవర్ల నిరసన

కశింకోట: ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం బయ్యవరంలో సిమెంట్ పరిశ్రమ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ పదేళ్లగా పని చేస్తున్న ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లకు జీతాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలో సెలవులు సైతం ఇవ్వడం లేదన్నారు. సత్వరమే పరిశ్రమ యాజమాన్యం జీతాలు పెంచి ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకర్, ట్రాన్స్‌పోర్టు కార్మికులు పాల్గొన్నారు.

భారీ గుంత.. వాహనదారుల చింత


పరవాడ సబ్‌స్టేషన్ కూడలిలో ఏర్పడిన భారీ గుంత

పరవాడ: ఇటీవల కురిసిన వర్షాలకు స్థానిక సబ్‌స్టేషన్ నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పడిన భారీ గుంత ప్రయాణికుల్ని భయపెడుతోంది. ఈ కూడలి మీదుగా వందల సంఖ్యలో భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఫార్మాసిటీ, హిందూజా, ఎస్ఈజెడ్, ఎన్టీపీసీ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, విశాఖ, గాజువాక, స్టీల్‌ప్లాంట్, పరవాడ తదితర ప్రాంతాల్లోని విద్యా సంస్థల్లో చదువుకునే విద్యార్థులకు సబ్‌స్టేషన్ కూడలే ప్రధాన మార్గం. రాత్రి సమయంలో ఇళ్లకు చేరే హడావుడిలో ఉండే ప్రయాణికులకు ఈ భారీ గుంత ఇబ్బందులకు గురిచేస్తోంది. ఏ మాత్రం వర్షం పడినా గుంతల్లో నీరు చేరి, దాని లోతు తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. సబ్‌స్టేషన్ నుంచి మండల కాంప్లెక్స్ వరకు పలు చోట్ల ఏర్పడిన గుంతల్ని పూడ్చేందుకు ఆర్ అండ్ బీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల నిరసన


మాడుగుల జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు లెక్చరర్లు

నర్సీపట్నం : రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న లెక్చరర్లు సోమవారం పసుపు రిబ్బన్లు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఏపీ కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శర్మ మాట్లాడుతూ జీవో నంబరు 114 ప్రకారం అందరిని రెగ్యులర్ చేయాలన్నారు. దశల వారిగా ఆందోళనకు స్టేట్ కమిటీ రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ఆందోళనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన జీవో ప్రకారం ఎన్నో ఏళ్ల నుంచి పని చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతికి వినతి పత్రం అందజేశారు.

మాడుగుల : ఎన్నికల కోడ్ వల్ల ఆగిపోయిన క్రమబద్ధీకరణ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని స్థానిక జూనియర్ కళాశాల వద్ద కాంట్రాక్టు లెక్చరర్లు సోమవారం కళాశాలకు హాజరైై వారు పసుపు రంగు రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఆగిపోయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులైజేషన్ యాక్ట్ 10, జీవో నంబరు 114 మరలా పునరుద్ధరించి తమను ఆదుకోవాలని, వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జూనియర్ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్లు ప్రశాంతి, హారిక, మణికేశ్వరి, అన్నపూర్ణ, రామకృష్ణ, సుమన్, డి.నాయుడు, చిన్నంనాయుడు పాల్గొన్నారు.

పంచాయతీ విధులపై రెండు రోజుల శిక్షణ

సబ్బవరం: మండలంలోని ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పద్మజ సోమవారం తెలిపారు. మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి ఉప సర్పంచ్‌తో పాటు ఇద్దరు వార్డు మెంబర్లకు శిక్షణ ఇస్తామన్నారు. పంచాయతీ విధులు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. మంగళ, బుధవారాల్లో రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు చోడవరంలో మెగా జాబ్ మేళా

చోడవరం రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో ఏపీఎస్ డీసీ, కళాశాల స్కిల్ హబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభం అవుతుందన్నారు. ఆ రోజు సాయంత్రం వరకు జరగనున్న మేళాలో అపోలో ఫార్మసీ, వరుణ్ మోటార్స్, హెల్త్‌కేర్ సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధి లోని నిరుద్యోగ యువకులు జాబ్ మేళాకు హాజరై సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ వి.అప్పలనాయుడు తెలిపారు. ఉద్యోగ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ అభ్యర్థులు తమ బయోడేటాలతో, వారికున్న అర్హతల జెరాక్సు ప్రతులతో సంబంధిత సంస్థల ప్రతినిధులను సంప్రదించాలని, ఇతర వివరాల కోసం స్కిల్ హబ్ ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాస్‌ను 9494791935 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కోనేరులో పడి వృద్ధుడు గల్లంతు


గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ అసిరితాత


గల్లంతైన సన్యాసి(ఫైల్)

పెందుర్తి: మండలంలోని దువ్వపాలెం గ్రామం కోనేరులో ఓ వృద్ధుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన యర్ర సన్యాసి(65) సోమవారం ఉదయం బహిర్భూమికి సమీపంలో ఉన్న కోనేరు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో జారి పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ అసిరితాత ఆధ్వర్యంలో గజ ఈతగాళ్ల సాయంతో సన్యాసి కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. అర్ధరాత్రి వరకు ఎలాంటి ఫలితం కనిపించలేదు.